పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ఆర్మీ 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ముష్కరమూకలను తుదముట్టించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మంగళవారం అర్ధరాత్రి వ్యూహాత్మకంగా మెరుపుదాడులతో పాకిస్తాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి విజయవంతంగా ఆపరేషన్ పూర్తిచేయడంపై ఇండియన్ ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ బలగాలను యావత్ ప్రజానీకం అభినందనలతో ముంచెత్తుతోంది. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళనల మధ్య పాక్‌పై ప్రతీకార దాడికి చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై ఉమ్మడి జిల్లా ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బుధవారం పలుచోట్ల వివిధ సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ తీసి దేశభక్తి చాటుకున్న ప్రజలు ఉగ్రదాడులకు తెగబడిన వారిని దెబ్బ కు దెబ్బ కొట్టాల్సిందేనని, పాక్‌పై ప్రతీకారం తీర్చుకోవాల్సిందేనని ముక్తకంఠంతో నినదించారు.

*- హనుమకొండ చౌరస్తా, మే 7*



జనగామలో భారత సైన్యానికి మద్దతుగా ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్న జాతీయ జెండాలు



### జాతీయ జెండాలతో మద్దతు ప్రదర్శన..

పాకిస్థాన్ ఉగ్ర సంస్థలపై భారత సైనికులు చేస్తున్న యుద్ధానికి మద్దతుగా ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో జాతీయ జెండాల ప్రదర్శన నిర్వహించి దేశం కోసం అవసరమైతే యుద్ధంలో పాల్గొనడానికి కూడా సిద్ధమని ప్రకటించింది. కార్యక్రమంలో డాక్టర్ రాజమౌళి, డాక్టర్ ప్రీతిదయాళ్, ఎర్త్ ఫౌండేషన్ డైరెక్టర్ మంగళంపల్లి రాజు, ముద్రబోయిన రాజు, ఆంజనేయులు, నల్ల రాహుల్ పాల్గొన్నారు.

OPERATION SINDOOR



# సైన్యానికి సెల్యూట్

## 'ఆపరేషన్ సిందూర్' సక్సెస్‌పై సర్వత్రా హర్షం

- పాక్‌పై ప్రతీకార దాడికి వెల్లువెత్తిన మద్దతు
- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల జాతీయ జెండాలతో ర్యాలీలు

### పాకిస్థాన్‌తో యుద్ధానికి సై

- భారత సైన్యం ఎప్పుడు పిలిచినా రెడీ
- విశ్రాంత సైనికుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల భిక్షపతి



జనగామలో మాట్లాడుతున్న విశ్రాంత సైనికుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మాచర్ల భిక్షపతి

జనగామ, మే 7 (నమస్తే తెలంగాణ) : పాకిస్థాన్‌తో యుద్ధం చేయాల్సి వస్తే భారత సైన్యం ఎప్పుడు పిలిచినా తామంతా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని విశ్రాంత సైనికుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల భిక్షపతి స్పష్టం చేశారు. బుధవారం ఆయుష్మాన్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పహల్గాంలో ఏప్రిల్ 22న జరిగిన పాశవిక చర్యకు ప్రతీకారంగా 9 ఉగ్ర స్థావరాలపై దాడిచేసి మట్టుపెట్టిన భారత వీర సైన్యానికి విజయకేతనం తెలుపుతూ వారికి సంఘీభావంగా ప్రతి భారతీయుడు నిలబడాల్సిన సమయం వచ్చిందన్నారు. దేశ సౌభ్రాతృత్వం, రక్షణకు అండగా నిలబడాలనేది మన కర్తవ్యంగా భావించాలని.. భారత సైన్యం ఏ పరిస్థితిలోనైనా తమ అవసరం ఉందని భావిస్తే తామంతా వెళ్లేందుకు ఒక బ్యాగ్ ఇప్పటికే సిద్ధం చేసి పెట్టుకున్నామని స్పష్టం చేశారు. పర్యాటకులను అమానుషంగా కాల్చి చంపి కొంతమంది మహిళల సిందూరాన్ని దూరం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి తగిన బుద్ధి చెప్పాలని ఉద్దేశంతో కేవలం 15 రోజుల్లోనే ఆపరేషన్ సిందూర్ పేరుతో సామాన్య పౌరులకు ఎలాంటి అపాయం లేకుండా కేవలం ఉగ్ర సంస్థలనే గురిచూసి స్థావరాలను ధ్వంసం చేసి న భారత సైన్యానికి అభినందనలు తెలిపారు. ఉద్వేగభరితమైన రోజును పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ సంబురంగా పండుగలాగా జరుపుకోవాలని కోరారు. అనంతరం సాయంత్రం ఆర్టీసీ చౌరస్తా వద్ద మాజీ సైనికుల ఆధ్వర్యంలో పటాకులు కాల్చి, స్వీట్లు పంచి విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ జైన రమేశ్, విశ్రాంత సైనికుల జిల్లా సమాఖ్య అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, కోశాధికారి యూసుఫ్, విశ్రాంత సైనికులు కుమార్ యాదవ్, వెంకన్న, ప్రభాకర్, డాక్టర్ గౌతమ్‌రెడ్డి, బద్రీనాథ్, రాజేశ్ పాల్గొన్నారు.

### సర్జికల్ స్ట్రైక్ తరహాలో భారత ప్రతీకార దాడి



ఉగ్రవాదంపై భారత్ చూపించిన అసలైన శక్తి ఇది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో సర్జికల్ స్ట్రైక్ తరహాలో భారత సైన్యం జరిగిన ప్రతీకార దాడులకు భారతీయుడుగా గర్విస్తున్నాం. ఉగ్రమూకలను తొలగిస్తూ మహిళల ఆత్మగౌరవం కోసం చేస్తున్న న్యాయపూర్వక చర్యలు ఇవి. ఇది యుద్ధం మాత్రమే కాదు. ఇది మానవత్వం కోసం పోరాటం. దేశ రక్షణ కోసం కట్టుబడి ఉన్న ప్రతి వీరుడికి అభినందనీయం.

*– డాక్టర్ కంజర్ల మనోజ్ కుమార్, బీఆర్‌ఎస్ 4వ డివిజన్ అధ్యక్షుడు*

### ఉక్కుపాదంతో అణచివేయాలి



ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలి. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత ప్రభుత్వం ఉగ్రవాదాన్ని అంతం చేయాల్సిందే. భారత సైన్యం ప్రదర్శించిన తన సైనిక పాటవానికి ఒక భారతీయుడుగా నేను గర్వపడుతున్నా. భారతదేశం ప్రపంచ దేశాలకు ఆదర్శం కావాలి. పహల్గాం ఉగ్రదాడి చాలా బాధాకరం. పాక్‌పై ప్రతీకార చర్య తీసుకోవాలి. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ స్థావరాలపై క్షిపణుల వర్షం కురిపించి ముష్కరులను హతం చేయడం ఆనందంగా ఉంది.

*– గడ్డం అనిల్, ఆర్మీ జవాన్*

### ఉగ్రవాదాన్ని అంతమొందిస్తేనే శాంతి సామరస్యాలు



ఉగ్రవాదం, ఉన్మాదం ఏ రూపంలో ఉన్నా.. ఏ దేశంలో ఉన్నా.. ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే. కచ్చితంగా ఉగ్రవాదం అంతం కావాల్సిందే. ఈ విషయంలో పాజిటివ్‌గా ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకం కావాలి. అప్పుడు శాంతి సామరస్యాలు నెలకొంటాయి. భారత సైన్యం ఎంత వీరోచితంగా దాడులు చేసిందో.. అంతే అప్రమత్తంగా ఉండి దేశరక్షణలో మేమెవరికీ తీసిపోమన్నట్లుగా వారికి శక్తి సామర్థ్యాలుండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నా.

*– చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, హనుమాన్‌నగర్, హనుమకొండ*



మహబూబాబాద్‌లో జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న యువత

### ప్రతి పౌరుడు సైనికుడిలా ముందుకుసాగాలి



టెర్రరిజాన్ని అంతం చేసేందుకు తలపెట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రపంచ దేశాలు మద్దతు పలుకుతున్నాయి. ఈ యుద్ధం ఎప్పటికీ ఆగదు. ప్రతి పౌరుడు ఒక సైనికుడిల్లా ముందుకురావాలి. మాక్‌డ్రిల్‌ను అనుసరించి ప్రతిఒక్కరూ ఉండాలి. 9 స్థావరాలపై ఇండియన్ ఆర్మీ దాడి చేసింది. పాకిస్తాన్‌కు ఇప్పటికే వణుకు పుట్టింది. పాక్‌పై యుద్ధం చిన్నపిచ్చుకపై బ్రహ్మాస్త్రం. ప్రతిఒక్క పౌరుడు సైనికుడిలా ముందుకుసాగాలి. సమయం వస్తే నేను కూడా మళ్లీ యుద్ధానికి వస్తా. ఉగ్రవాదుల సంస్థలను అంతమొందించాలి. *– కావటి భిక్షపతి, రిటైర్డ్ ఆర్మీ అధికారి*

# రైతులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్

- సీఎం రేవంత్‌ను ఎవరూ నమ్మతలేరు
- రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం
- ఆపరేషన్ సిందూర్‌తో మృతుల ఆత్మకు శాంతి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



వర్ధన్నపేట: కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

వర్ధన్నపేట/తొర్రూరు/రాయపర్తి/పెద్దవంగర/దేవరుప్పుల, మే 7 : దేశానికి అన్నంపెట్టే రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచుతున్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలతో పాటు పార్టీ అధిష్టానం కూడా నమ్మకం కోల్పోయిందని ఎద్దేవా చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందన్నారు. బుధవారం ఆయన వరంగల్ జిల్లా వర్ధన్నపేట, మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. అలాగే రాయపర్తితో పాటు తొర్రూరు, పెద్దవంగర, జనగామ జిల్లా దేవరుప్పులలో పార్టీ ముఖ్యకార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు ప్రణాళిక లేకుండా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంతో రోజుల తరబడి కాంటాలు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనివల్ల అకాల వర్షాలకు ధాన్యం తడిసి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కాంటాలు పూర్తయిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడం లేదని, సకాలంలో డబ్బులు ఖాతాల్లో జమచేయడం లేదన్నారు. ప్రధానంగా సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి రైతులకు ఎగనామం పెడుతున్నదని ధ్వజమెత్తారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ దివాలా తీసిందని చేసిన వ్యాఖ్యలతో ప్రపంచ స్థాయిలో రాష్ట్రం అప్రతిష్ఠ మూటగట్టుకున్నదన్నారు. భవిష్యత్‌లో ఏ కంపెనీ కూడా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాదన్నారు. పాలన చేతగాని రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గంలో ఆరు చొప్పున ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను కేవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాళేశ్వరం ద్వారా సాగునీరు, 24 గంటల విద్యుత్, పంట ఉత్పత్తుల కొనుగోలు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేసింది కేవలం బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఇటీవల ఎల్కతుర్తిలో జరిగిన రజతోత్సవ సభ సందర్భంగా కేసీఆర్ చేసిన ప్రసంగం ప్రజల్లో కొత్త ఉత్తేజాన్ని తీసుకువచ్చిందన్నారు.

**అంతం కాదిది ఆరంభం**

ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ టెర్రరిస్టులు పొట్టన పెట్టుకున్న అమాయకుల ఆత్మకు శాంతి కలుగుతుందని ఎర్రబెల్లి అన్నారు. మన సైన్యం ఉగ్రమూకల స్థావరాలను నేలమట్టం చేయడమే కాకుండా టెర్రరిస్టులను మట్టుపెట్టడంపై దేశం గర్విస్తున్నదన్నారు. తిండికి గతిలేకపోయినా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ దేశంపైకి ముష్కరులను ఉసిగొల్పుతున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పాల్సిందేన్నారు. మన త్రివిధ దళాలు తలచుకుంటే పాకిస్థాన్ నామరూపాలు లేకుండా పోతుందని, ఇది ఆరంభమేనని, అంతం కాదన్నారు. ఇప్పటికే ప్రపంచ దేశాల మద్దతు కూడబెట్టిన ప్రధాని మోడికి రాజకీయాలకతీతంగా దేశం మద్దతుగా నిలుస్తుందన్నారు. మన పక్క దేశమైన చైనా తన వైఖరిని స్పష్టం చేయాలని, ప్రపంచానికి హాని చేస్తున్న తీవ్రవాదాన్ని అంతమొందించడంలో భారత్‌కు బాసటగా నిలవాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న జవాన్లకు, త్రివిధ దళాలకు సెల్యూట్ చేస్తున్నానని ఎర్రబెల్లి తెలిపారు. కాగా, రాయపర్తి మండలం జయరాంతండా(కే)కు చెందిన లావుడ్య నరేశ్ బీఆర్‌ఎస్‌లో చేరగా ఎర్రబెల్లి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ జీసీసీ చైర్మెన్ గాంధీనాయక్, బీఆర్‌ఎస్ నాయకులు గుడిపూడి గోపాల్‌రావు, పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, సిలువేరు కుమారస్వామి, మధుసూదన్, పసుమర్తి సీతారాములు, మంగళంపల్లి శ్రీనివాస్, తూర్పటి అంజయ్య, బిందు శ్రీనివాస్, ఏ ప్రదీప్ రెడ్డి, కుర్ర శ్రీనివాస్, ఎన్నమనేని శ్రీనివాసరావు, మణిరాజు, తూర్పటి రవి శంకర్, ఐలయ్య, సంజయ్, రామచంద్రయ్యాశర్మ, యాదగిరిరావు, సుధీర్‌కుమార్, రఘు, పటేల్ నాయక్, జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, పూస మధు, గారె నర్సయ్య, కర్ర రవీందర్‌రెడ్డి, కుందూరు రామచంద్రారెడ్డి, లేతాకుల రంగారెడ్డి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, అయిత రాంచందర్, కుందూరు యాదగిరిరెడ్డి, భూక్యా భద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఖాతాల్లో జమకాని డబ్బులు

ప్రస్తుత యాసంగిలో ప్రభుత్వం ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల టన్నుల దొడ్డు, 10.32 లక్షల టన్ను ల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేసిందన్నారు. ఇందుకోసం రైతులకు రూ.515.82 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇంత వరకు చెల్లింపుల ప్రక్రియ ప్రారంభించలేదన్నారు. వ్యవసాయశాఖ మంత్రి మా త్రం ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తామన్న మాటలు ఆచరణలో జరగడం లేదన్నారు. అలాగే రైతులకు చెల్లించాల్సిన రూ.500 కోట్ల పెండింగ్ బోనస్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని, అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నత్తనడకన పుష్కర పనులపై కమిషనర్ సీరియస్

- సకాలంలో పూర్తికాకపోతే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు అసంతృప్తి
- ఆశించిన స్థాయిలో జరగడం లేదని అసహనం
- మూడు షిఫ్టుల్లో పనులు చేయాలని ఆదేశాలు
- కాళేశ్వరంలో కలెక్టర్, ఎస్పీతో కలిసి ఏర్పాట్ల పరిశీలన



అధికారులతో చర్చిస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు

మహదేవపూర్ (కాళేశ్వరం), మే 7 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతీ పుష్కరాల పనులు నత్తనడకన సాగుతుండడంపై దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు సీరియస్ అయ్యారు. సకాలంలో పనులు పూర్తిచేయకపోతే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి ఆయన పుష్కరాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీఐపీ, గోదావరి ఘాట్‌లు, టెంట్ సిటీ, హారతి, పుష్కర స్నానాల ప్రాంతం, 100 గదుల సత్రం, హెలిప్యాడ్ తదితరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల విషయంలో రేపు అన్న పదమే వాడొద్దన్నారు. గతంలో జరిగిన గోదావరి, కృష్ణా పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలన్నారు. మొదటి సారి జాయ్ రైడ్, టెంట్ సిటీ ఏర్పాటు చేస్తున్నారని కలెక్టర్‌ను అభినందించారు. ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదని, చాలా పెండింగ్‌లో ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. రానున్న వారం రోజుల్లో మూడు షిఫ్టుల్లో పనులు జరగాలని ఆదేశించారు. దేవాదాయ శాఖ పనులు నత్తనడకన సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వీఐపీ ఘాట్ నుంచి గోదావరి ఘాట్ వరకు తాత్కాలిక రోడ్డు కోసం భూములు లీజుకిచ్చిన రైతులను అభినందించారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందని, జడ్పీ సీఈవో పర్యవేక్షించాలని ఆదేశించారు. షవర్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, గోదావరి వద్ద ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్ల పనుల్లో వేగం పెంచాలన్నారు. 12 రోజుల పాటు పండుగ వాతావరణంలో పుష్కరాలు జరగాలన్నారు. ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ టీములు అందుబాటులో ఉంచాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఇరిగేషన్, పీఆర్, ఆర్ డబ్ల్యూఎస్, దేవాదాయ, ఇంజినీరింగ్ శాఖల విధులు ముఖ్యమైనవని, పుష్కరాలు పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బందికి సెలవులు లేవన్నారు. కలెక్టర్ అనుమతి లేకుండా కార్యస్థానం విడిచి వెళ్లొద్దని, అంకితభావంతో పని చేయాలన్నారు. పుష్కరాల సమయంలో ప్రతి రోజు 5 వేల మందికి ఉచిత అన్నదానం చేయాలని దేవస్థానం అధికారులను కమిషనర్ ఆదేశించారు.

**5 సెక్టార్లు.. 18 జోన్లు**

ఈ నెల 15న సీఎం వస్తున్నారని, సరస్వతీ విగ్రహం ప్రారంభం, పుష్కర స్నానం, దర్శనం, హారతి కార్యక్రమంలో పాల్గొంటారని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. 5 సెక్టార్లు, 18 జోన్లుగా విభజించి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గోదావరిలో వ్యర్థాలు తొలగించాలన్నారు. నోడల్ అధికారులను నియమించి పనుల పర్యవేక్షణ అప్పగిస్తామన్నారు. వీఐపీ ఘాట్ వద్ద షవర్స్, బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలన్నారు. హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించేందుకు వీలుగా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేయాలని దేవస్థానం అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ కిరణ్‌ఖరే మాట్లాడుతూ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మంత్రులు దిశా నిర్దేశం చేశారని, పనుల్లో నాణ్యత పాటించాలని, పనులను పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, దేవాదాయ శాఖ ఆర్జేసీ రామకృష్ణారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

# బోనస్ ఎగవేసేందుకే కొనుగోలు ఆలస్యం

- రైతాంగాన్ని నిలువు దోపిడీ చేస్తున్న కాంగ్రెస్
- ధాన్యం కొనుగోలులో అక్రమాలు
- సివిల్ సప్లయి టెండర్లలోనూ గోల్‌మాల్
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ, మే 7: బోనస్ ఎగవేసేందుకే ధాన్యం కొనుగోలు ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వం ఆలస్యం చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం హనుమకొండలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలువు దోపిడీ చేస్తున్నదని, పండించిన ప్రతి పంటకూ కమీషన్ తీసుకుంటూ దాన్నే ఆదాయ మార్గంగా ఎంచుకుందని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రూ. 1100 కోట్లు.. నిన్న సీసీఐ పత్తి కొనుగోళ్లలో రూ. 3000 కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. నిధులు, ఆర్థిక స్థితి బాగా లేదంటూనే కాంగ్రెస్ నాయకులు కుంభకోణాలు, అవినీతికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు నష్టాల్లో కూరుకుపోయినా పట్టించుకోవడం లేదన్నారు. టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్ల కోసం రైతులు కొట్టుకుంటున్నారని అన్నారు. సివిల్ సప్లయి ధాన్యం కొనుగోలులో అవినీతి, అక్రమాల విషయంలో హైకోర్టు నోటీసులు జారీ చేసి 14 నెలలు గడుస్తున్నా 14 సార్లు వాయిదాలు కోరిన ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదంటే కుంభకోణం జరిగిందని ఒప్పుకున్నట్లేనా అని ప్రశ్నించారు. ఇటీవల వరంగల్ పర్యటనకు వచ్చిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గాల్లో వచ్చి గాలి మాటలు మాట్లాడారని అన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు బ్రహ్మాండంగా జరు గుతుందని ప్రగల్భాలు పలుకుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాయిశ్చర్, వేయింగ్, గ్రేడింగ్ మిషన్, టార్పాలిన్ల వంటి వాటికి టెండర్లు ఇప్పుడు ఎందుకు పిలిచారని ప్రశ్నించారు. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా పంజాబ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు 25 శాతం ఎక్సెస్‌తో సమయం దాటిన తర్వాత సీజ్ చేసిన టెండర్ బాక్స్‌ను తెరిచి దాఖలు చేశారని, దీనిపై ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానాలు చెపుతున్నారని పెద్ది ధ్వజమెత్తారు. ఇందులో పెద్ద మొత్తంలో కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలోని మంత్రుల నుంచి ఎమ్మెల్యేల వరకు కొనుగోళ్ల కుంభకోణానికి పాల్పడుతున్నారని, ఇది గత చరిత్రలో ఎప్పుడూ జరుగలేదన్నారు.అలాగే హైదరాబాద్, వరంగల్ సీసీఐ పత్తి కొనుగోలు విషయంలో రూ. 3వేల కోట్ల కుంభకోణం జరిగినా ప్రభుత్వం స్పందించడం లేదని సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. ఇందులో వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల ఇన్వాల్‌మెంట్ లేనపుడు వారు ఎందుకు సమీక్షలు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. కుంభకోణాలపై బీఆర్‌ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఇందులో భాగంగా మొదట హైదరాబాద్‌లోని రీజినల్ మేనేజర్, ఆతర్వాత జనరల్ మేనేజర్ కార్యాలయాల ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, నాయకులు నయీముద్దీన్, బండి రజినీకుమార్ పాల్గొన్నారు.

# ప్రవీణ్ కుటుంబానికి అండగా ఉంటాం

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- రూ. 4 లక్షల ఎఫ్‌డీ బాండ్ అందజేత



ప్రవీణ్ కుటుంబ సభ్యులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, మే 7 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ పట్టణ నాయకుడు పానుగంటి ప్రవీణ్ ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచలో దివంగత ప్రవీణ్ దశదిన సంతాపసభలో ఆయన పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రవీణ్ మరణించడం బాధాకరమన్నారు. అనంతరం ఎమ్మెల్యే తనవంతుగా రూ. 2 లక్షలు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి రూ. లక్ష, పలువురు నాయకులు అందజేసిన మరో రూ. లక్ష, మొత్తం రూ. 4 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి అందుకు సంబంధించిన బాండ్‌ను ప్రవీణ్ భార్య, పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుగుణాకర్ రాజు, నాయకులు గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, ముస్త్యాల దయాకర్, ఉడుగుల నర్సింహులు, దేవునూరి సతీశ్, మసియుద్దీన్, ఉడుగుల కిష్టయ్య, గుర్రం నాగరాజు, మీడియా ఇన్‌చార్జి రాజు తదితరులు పాల్గొన్నారు.